క్లుప్తంగా

ఎస్సీ కాలనీకి ప్రహరీ నిర్మించాలని వినతి



సుబ్బారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నక్కపల్లి: స్థానిక ఎస్సీ కాలనీకి రక్షణగా ప్రహరీ నిర్మించాలని పలువురు దళితులు శుక్రవారం హెటిరో కంపెనీ యాజమాన్యాన్ని కోరారు. వైఎస్ ఎంపీపీ వీసం నానాజీ ఆధ్వర్యంలో కాలనీకి చెందిన దళిత నాయకులు కంపెనీ డీజీఎం సుబ్బారెడ్డిని కలిశారు. ప్రహరీ లేకపోవడం వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చుట్టు పొలాలు ఉండటం , భారీ వర్షాలు పడిన సమయంలో వర్షపునీరు కాలనీని ముంచెత్తుతోందన్నారు. రెండు పక్కల ప్రహరీ ఉందని, ఒక పక్క లేకపోవడం వల్ల నివాస ప్రాంతాల వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఎస్ఆర్ నిధులు కేటాయించి ప్రహరీ నిర్మించాలని కోరారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో దళిత నాయకులు బద్దా ప్రకాష్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: అరబుపాలెంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అరబుపాలెంలోని యాతపేటలో మరమ్మతుకు గురైన పైపులైన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే పాలకవర్గం దృష్టికి తీసుకురావాలన్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపైనా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఇంటింటికీ తాగునీటి సరఫరాకు చర్యలు



కాంక్రీట్ పనులు పరిశీలిస్తున్న మూలపేట ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక: మండలంలోని మూలపేట శివారు గంగాదేవిపేటలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర తెలిపారు. రూ.43 లక్షలతో 20 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన రక్షిత నీటి పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు పైపులైన్ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా పైపులైన్‌కు సంబంధించి కాంక్రీట్ పనులను దేవీచంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పథకం ప్రారంభించి ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. పాల సంఘం అధ్యక్షుడు సమ్మింగ భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: స్థానిక విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కే రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఎర్రవరం, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో రైతులు గమనించాలని సూచించారు.

ఘనంగా దేవీతల్లి విగ్రహం ఊరేగింపు



దేవీతల్లి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో దేవీతల్లి విగ్రహం ఊరేగింపు శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఊరేగింపులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.కాగా శనివారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కుక్కలు, కోతుల బెడద

పేటలో స్వైర విహారం ● అపరిశుభ్రం చేస్తున్న పందులు



ఇళ్లపై తిష్ట వేసిన కోతులు



వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు



పట్టణంలో సంచరిస్తున్న పందులు

పాయకరావుపేట: పట్టణంలో కుక్కలు, కోతులు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా సంచరిస్తున్నా వీటి నివారణ చర్యలు గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. అనేక మందిపై కుక్కలు, కోతులు దాడులు చేస్తున్నాయని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోతులు రాత్రి పగలే అనే తేడా లేకుండా ఇళ్లపై సంచరిస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి వంట సామగ్రిని, వంటలను ధ్వంసం చేస్తున్నాయి. మేడలపై ఆరవేసిన బట్టలను చింపివేస్తున్నాయి. కోతులు బెడద కారణంగా ప్రజలు తలుపులు వేసుకుని గదుల్లోనే ఉండిపోతున్నారు. ప్రహరీపైన, గేట్లపైన రాత్రి, పగలు తిష్ట వేయడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలువురిపై దాడి చేసి గాయపరిచిన ఘటనలు ఉన్నాయి.

కుక్కలతో భయభ్రాంతులు ..

గ్రామంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీధుల్లో పిల్లలు వీటిని చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజలు బజారు నుంచి వచ్చేటప్పుడు చేతిలో వస్తువులను లాక్కుని పోతున్నాయి. రాత్రి సమయంలో ప్రజలు నిద్రపోకుండా గుంపులుగా తిరుగుతూ అరుస్తున్నాయి. రోడ్లపై వచ్చే వాహనదారులను వెంబడించి దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు కర్రలతో బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది.

వీధుల్లో పందుల సంచారం

పందులు సైతం పట్టణ వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వీటి పెంపకందారులు పట్టణ పరిధిలోనే నివాసం ఉండడంతో రాత్రి పగలు అని తేడా లేకుండా విడిచి పెడుతున్నారు. వాహనాల సామగ్రిని లాగేసి చిందరవందర చేస్తున్నాయి. మురుగు కాలువల్లో పొర్లుతూ రోడ్లను పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో కోతులు, కుక్కలు, పందులు సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

నివారణ చర్యలు తీసుకోవాలి



పట్టణంలోని పలు ఇళ్లలోకి కుక్కలు, కోతులు, పందులు ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. సంబంధిత అధికారులు, పంచాయతీ అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

– ఆదారి నూకరాజు, పాయకరావుపేట

ప్రజలకు ఇబ్బందులు



పట్టణంలో కోతులు, పందులు, కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.– జి.రాజశేఖర్ రెడ్డి, పాయకరావుపేట

అధిక లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్‌పై ఆగ్రహం

మునగపాక: పూడిమడక రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న వాహన డ్రైవర్‌పై శుక్రవారం సాయంత్రం మునగపాకలో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వాహనాల వల్ల సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కొంత కాలం క్రితం స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో రాత్రి 10 గంటల తర్వాత నుంచి తెల్లవారు లోగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు అంగీకరించారు. ఇదేమీ పట్టనట్లు లారీ డ్రైవర్లు అధిక లోడుతో వాహనాలను తిప్పుతున్నారు. దీనిలో భాగంగా అధిక లోడుతో రాయిని తరలిస్తున్న లారీని స్థానికులు అడ్డుకున్నారు. ఈ మార్గంలో రాత్రిళ్లు మాత్రమే రాకపోకలు సాగించేలా అధికారులు చొరవ చూపుతుంటే, అధిక లోడుతో ఎలా వస్తారంటూ స్థానికులు సంబంధిత డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి లారీ డ్రైవర్‌ను మందలించారు.

డ్రోన్ స్ప్రేయర్‌తో అధిక ప్రయోజనాలు



డ్రోన్ స్ప్రేయర్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

కోటవురట్ల: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించడంతోపాటు యంత్రాలను వినియోగించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. పాములవాకలో రైతు అశోక్ కొనుగోలు చేసిన డ్రోన్ స్ప్రేయర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ శాఖ పలు యంత్రాలను రాయితీపై అందిస్తోందన్నారు. డ్రోన్ స్ప్రేయర్‌తో సమయం ఆదా అవ్వడమే కాకుండా కూలీలకు ఖర్చు తగ్గుతుందన్నారు. జీడి తోటలు, వరి చేలకు డ్రోన్ ద్వారా స్ప్రే చేయడం ద్వారా తెగుళ్ల నివారణ సాధ్యపడుతుందని తెలిపారు.

కె.వి.పురంలో పారిశుధ్య డ్రైవ్



కె.వెంకటాపురంలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లోని చెత్తను సేకరించి డ్రైనేజీలలో పూడిక తీశారు. మురుగు గుంటలపై బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని, వీధుల్లో చెత్తను ఇష్టానుసారంగా వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఇంటితో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

జోరుగా రాఖీల విక్రయాలు



మార్కెట్లో విక్రయిస్తున్న రాఖీలు



మునగపాకలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

నక్కపల్లి: అన్నాచెల్లెళ్ల పండగ (రాఖీ పండగ)గా పిలుచుకునే రక్షాబంధన్‌కు సర్వం సిద్ధమవుతున్నారు. శుక్రవారం పలు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. రంగురంగులు, వివిధ మోడళ్లతో కూడిన రాఖీలను మార్కెట్లో విక్రయిస్తుండటంతో కొనుగోలు చేసేందుకు మహిళలు పోటీపడ్డారు. దీంతో దుకాణాలన్నీ రద్దీగా మారాయి. సామాన్యులకు అందుబాటులో ఉన్న రాఖీలతోపాటు ఖరీదైనవి విక్రయిస్తున్నారు.

కొనుగోలుదారులతో స్టాళ్ల కిటకిట

మునగపాక: రాఖీ సందర్భంగా పలు దుకాణాలు కిటకిటలాడాయి. శనివారం రాఖీ పండగ జరగనున్న నేపథ్యంలో పలు చోట్ల స్టాళ్లు ఏర్పాటు చేశారు. పలు డిజైన్లతో కూడిన రాఖీలను కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపారు. రాఖీని బట్టి ధరలు నిర్ణయించడంతో కొనుగోలుదారులతో పలు చోట్ల కిటకిటలాడాయి. పిల్లల నుంచి పెద్దల వరకు రాఖీల కొనుగోలుతో మెయిన్‌రోడ్డు సందడిగా కనిపించింది. రాఖీ కట్టే సమయంలో సోదరులకు మిఠాయిలు తినిపించడం ఆనవాయితీ కావడంతో సంబంధిత దుకాణాలు కొనుగోలుదారులతో నిండిపోయాయి.

క్వారీ బాధిత రైతులకు సీపీఐ మద్దతు



నిరసన తెలుపుతున్నక్వారీ బాధిత దళితులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీ బాధితుల నిరసనకు సీపీఐ మద్దతు తెలియజేసింది. నిరాహార దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా పెదబొడ్డేపల్లి మదుం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. క్వారీ అనుమతులను వెంటనే రద్దు చేయాలన్నారు. బీఎస్పీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



వెంకటరమణ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

అచ్యుతాపురం రూరల్: పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ మృతికి పలువురు సంతాపం తెలిపారు. శుక్రవారం వేకువజామున ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ గ్రామానికి చేరుకుని వెంకటరమణ పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అతడి కుటుంబానికి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ నివాళులర్పించారు. శుక్రవారం వేంకటేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన చేయాల్సి ఉండగా, ఇంతలో అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, జెడ్పీటీసీ లాలం రాము, చేపల శ్రీరాములు, చోడిపల్లి దేముడు, ఉమ్మిడి అప్పారావు, ఉమ్మిడి జగన్, తదితరులు అంతిమ వీడ్కోలు పలికారు.

నేడు కోనాంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

చీడికాడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం మండలంలోని కోనాంలో నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి జి.మంగవేణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు ఉదయం 10 గంటలకు గురుకుల బాలికల పాఠశాల సమీపంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఈ వేడుకలకు హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



తిమ్మరాజుపేటలో గాజుల అలంకరణలో దుర్గాదేవి



నక్కపల్లిలో కలశ పూజల్లో మహిళలు



చినలింగాపురంలోని దుర్గామల్లేశ్వర అయ్యప్ప ఆలయంలో..



వరలక్ష్మీ వ్రతంలో ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణ



దుర్గాలమ్మ చెట్టు వద్ద అమ్మవారిని పూజిస్తున్న భక్తులు



రావి, వేప చెట్టుకు పూజ చేస్తున్న భక్తులు

నక్కపల్లి: వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం వాడవాడలా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసంలో వచ్చే శుక్రవారం లక్ష్మీదేవిది కావడంతో తమ ఇంట అష్టైశ్వర్యాలు సమృద్ధిగా ఉండాలని కోరుతూ పలువురు కొత్తగా పెళ్లయిన స్త్రీతో తొలి ఏడాది మెట్టినింటివారు, పుట్టినింటివారు ఈ వ్రతాన్ని ఆచరింపజేశారు. ప్రతి ఇల్లు శ్రావణ శోభ సంతరించుకుని అమ్మవారి పూజలతో కళకళలాడాయి. అమ్మవారికి ప్రీతికరమైన గారెలు, పూర్ణాలు, పాయసం, పులిహోర తదితర 9 రకాల పిండివంటలు నైవేద్యంగా సమర్పించుకున్నారు. పసిడి ధరలు ఎగిసిపడటంతో తమ స్థోమతకు తగ్గట్టుగా లక్ష్మీరూపులు కొని అమ్మవారి వ్రతాన్ని ఆచరించారు. నక్కపల్లి, ఉపమాక, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. ఆండాళమ్మవారికి లక్ష్మి సహస్రనామ కుంకుమార్చన జరిగింది. ఈ కార్యక్రమాల అనంతరం సాయంత్రం సేవా కాలం, ప్రసాద వినియోగం నిర్వహించినట్టు ఆలయ ప్రధానార్చకులు జి.వరప్రసాదాచార్యులు తెలిపారు.

గాజుల అలంకరణలో దుర్గాదేవి

మునగపాక: మండల వ్యాప్తంగా వరలక్ష్మి దేవీ వ్రత వేడుకలను భక్తులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లల్లోనే అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించుకుని నగదు, బంగారు ఆభరణాలను హారాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన పండ్లు, పూలు, పిండి వంటకాలు సమర్పించారు. అనంతరం ముత్తైదువులను పిలిచి వాయనాలు సమర్పించారు. తిమ్మరాజుపేట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని దుర్గాదేవిని గాజులతో అలంకరించి పూజలు చేశారు.

కోటవురట్ల: శ్రావణ శుక్రవారాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇళ్లలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి ఆలయాలను దర్శించుకున్నారు. కనకదుర్గమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. చినలింగాపురంలో దుర్గామల్లేశ్వర అయ్యప్ప ఆలయం, కోటవురట్లలో కనకదుర్గమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వరాలివ్వు..వరలక్ష్మీ!

యలమంచిలి రూరల్: శ్రావణ శుక్రవారం సందర్భంగా యలమంచిలి పట్టణం, మండలంలోని వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పీఎస్ఆర్ పేట కనకదుర్గమ్మ, నూకాలమ్మ, యలమంచిలి బస్టాండు సమీపంలో నూకాంబిక, దిమిలిరోడ్డు వాసవీమాత ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లలో లక్ష్మీదేవి విగ్రహాన్ని కొలువుదీర్చి పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించి వ్రతాన్ని ఆచరించారు. పిండి వంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ముత్తయిదువులకు వాయనాలు ఇచ్చి ఆశీస్సులు అందుకున్నారు.

పాయకరావుపేట: శ్రావణ శుక్రవారం సందర్భంగా శుక్రవారం పట్టణంలో దుర్గాలమ్మ చెట్టు, దుర్గానగర్‌లో దుర్గాంబిక ఆలయం, అరట్లకోటలో ఓరుగుంటాలమ్మ గుడి వద్ద దుర్గాంబిక అమ్మవార్లకు భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎస్.రాయవరం: శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. పిండివంటలు, పండ్లు, పూలుతో అమ్మవారి ప్రతిమను, చిత్రపటాలను అలంకరించి పూజ నిర్వహించారు.

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో శ్రావణమాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పలు ఆలయాల వద్ద సామూహిక కుంకుమార్చన చేపట్టారు. దిమిలిలోని వల్లభనారాయణమ్మ ఆలయంలో పూజలు చేశారు. కట్టబోలు అయ్యప్పస్వామి ఆలయం వద్ద వేదపారాయం ఆలపించారు. ఇళ్లలోనూ మహిళలు వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు.



అచ్యుతాపురంలో వరలక్ష్మి పూజ



అలంకరణలో యలమంచిలి దిమిలిరోడ్డు వాసవీమాత



యలమంచిలి జీసీటీ వీధిలో అమ్మవారు

గిరిజనులను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి



మాట్లాడుతున్న నాన్ షెడ్యూల్ ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి

మాడుగుల: నాన్ షెడ్యూల్ ఆదివాసీ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. మండలంలో శంకరం పంచాయతీ తాడివలస రాయి పనుకు వద్ద మైదాన ప్రాంత ఆదివాస గిరిజనులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టి, నిజమైన ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 320 ఆదివాసీ గిరిజన గ్రామాలున్నాయని, ఐదో షెడ్యూల్‌లో చేర్చకపోవడంతో మైనింగ్ మాఫియాతో పాటు పెత్తందారులు అడవుల ఆక్రమణకు పాల్పడుతున్నారన్నారు. వీరికి ఐటీడీఏ పథకాలు అందకపోవడంతో పాటు విద్య, ఉద్యోగ అవకాశాలు పొందలేకపోతున్నారని చెప్పారు. మైదాన ఆదివాసి హక్కులపై జరుగుతున్న దాడులను తిప్పి కొట్టడానికి ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజనులు గిన్నెల పల్లి సన్యాసమ్మ, సోమల నరసింహమూర్తి, సిదిరి ఈశ్వరరావు, గొట్టూరు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అదానీతో కూటమి నేతల రహస్య మంతనాలు

దేవరాపల్లి: అదానీ గ్రూపు సంస్థలతో అధికార కూటమి పార్టీల నేతలు రహస్య మంతనాలు జరుపుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ఆరోపించారు. ఈ మేరకు దేవరాపల్లిలో శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. చింతలపూడి, మారిక మధ్య అదాని హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం తలపెడుతున్న తరుణంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తుడడంతో స్థానిక రైతులు, గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత నెల 29న రైవాడ ఆయకట్టుకు నీరు విడుదల సందర్భంగా జరిగిన సభలో అదాని హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని, ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన రాలేదన్నారు. ఆరు మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు, విశాఖ ప్రజలకు తాగునీరు అందిస్తున్న రైవాడ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణాన్ని విరమించుకోవాలన్నారు.